సాక్షి
ఖమ్మం
మంగళవారం । 14 । మార్చి । 2023



కనెక్షన్ లేకున్నా నల్లా పన్ను
కేఎంసీ పరిధి పలువురి ఇళ్లకు నల్లాలు లేకున్నా పన్ను చెల్లించాలని నోటీసులు రావడంతో ఫిర్యాదు చేసేందుకు బారులు దీరుతున్నారు. 8లో



పెద్దాస్పత్రిలో ఎన్ఎంసీ బృందం
జిల్లాకు ప్రభుత్వ మెడికల్ కళాశాల మంజూరైన నేపథ్యాన నేషనల్ మెడికల్ కౌన్సిల్ బృందం పెద్దాస్పత్రిని సందర్శించింది. 8లో

గరిష్టం / కనిష్టం
38° / 20°
వాతావరణం
మంగళవారం జిల్లాలో ఉదయం ఉష్ణోగ్రత తక్కువగానే నమోదవుతుంది. ఆ తర్వాత గంటగంటకు ఎండ పెరిగే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఎస్సెస్సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలు పకడ్బందీగా కొనసాగేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన సంబంధిత శాఖల అధికారులతో సమావేశమై సూచనలు చేశారు. వచ్చే నెల 3నుంచి 13వ తేదీ వరకు జరిగే పరీక్షలకు 16,873మంది విద్యార్థులు హాజరుకానుండగా, 103 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు గంట ముందుగా పరీక్షా కేంద్రానికి చేరుకునేలా అవగాహన కల్పించడంతో పాటు తాగునీరు, విద్యుత్ సౌకర్యం, వైద్యచికిత్సకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే, అవకతవకలు జరగకుండా సీసీ కెమెరాలు, పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటుచేయాలని కలెక్టర్ తెలిపారు. ఇక పరీక్ష జరిగే రోజుల్లో ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలని ఆదేశించారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ ఎస్.మధుసూదన్, డీఈఓ సోమశేఖరశర్మ, డీఎంహెచ్ఓ డాక్టర్ మాలతి, ఆర్‌టీఓ కిషన్‌రావు, మిషన్ భగీరథ ఈఈ పుష్పాలత, ఏసీపీ ప్రసన్నకుమార్, కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ మల్లీశ్వరి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ చంద్రశేఖర్, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసరావు, మధిర, వైరా మునిసిపల్ కమిషనర్లు రమాదేవి, అనిత తదితరులు పాల్గొన్నారు.

భ్రూణ హత్యల నిర్మూలనకు ప్రచారం



ఆటోకు స్టిక్కర్ అంటిస్తున్న జిల్లా జడ్జి, తదితరులు

ఖమ్మంలీగల్: భ్రూణ హత్యలను అరికట్టేలా విస్తృత ప్రచారం చేస్తూ అందరికీ అవగాహన కల్పించాల్సిన అవసరముందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు అన్నారు. భ్రూణ హత్యలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన రూపొందించిన పోస్టర్లు, స్టిక్కర్లను సోమవారం ఆయన జిల్లా కోర్టు ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ పిల్లలు వృద్ధిలోకి రావాలంటే బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలన్నారు. న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జావేద్ పాషా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొల్లపూడి రామారావు, జీపీ కృష్ణారావు, సీఐ అశోక్, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ శ్రీనివాస్‌తోపాటు ఇమ్మడి లక్ష్మీనారాయణ, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు పరిష్కరించండి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు

ఖమ్మం సహకారనగర్: ప్రజలు ఇచ్చే వినతిపత్రాలు, ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు స్నేహలత, ఎస్.మధుసూదన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి(గ్రీవెన్స్ డే)లో భాగంగా వారు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇద్దరు సీఐలకు పోస్టింగ్

ఖమ్మంక్రైం: ఇటీవల బదిలీ అయిన ఇద్దరు సీఐలకు పోస్టింగ్ ఇస్తూ ఐజీ చంద్రశేఖర్ రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఖమ్మం రూరల్ సీఐగా పనిచేసిన మల్లంపల్లి శ్రీనివాస్‌కు స్పెషల్ బ్రాంచ్ సీఐ–2గా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విధులు నిర్వర్తించి వీఆర్‌లో ఉన్న మోదుగు రమేష్‌కు నిజామాబాద్‌లో సీసీఎస్–1 సీఐగా పోస్టింగ్ ఇచ్చారు.

రియల్ బూమ్!

- ఖమ్మం నగరం చుట్టుపక్కల విస్తరిస్తున్న అభివృద్ధి
- నూతన కలెక్టరేట్ సమీప భూములకు మహర్దశ
- రూ.కోట్లు దాటేసిన ఎకరం ధర
- ఈ ప్రాంతంలో జోరందుకున్న రియల్ ఎస్టేట్



నూతన కలెక్టరేట్ సమీపంలోని వ్యవసాయ భూములు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఖమ్మం నగరం చుట్టుపక్కల ప్రాంతాలకు అభివృద్ధి విస్తరిస్తోంది. దీంతో ఆయా ప్రాంతాల్లోని భూముల ధరలు నాలుగు నుంచి ఐదు రెట్ల మేర పెరుగుతున్నాయి. ఫలితంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరందుకుంది. ప్రధానంగా రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెంలో నూతన కలెక్టరేట్ నిర్మాణంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో భూముల ధర రూ.కోట్లకు చేరింది. ఒకప్పుడు వ్యవసాయ భూమి ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతం ఇప్పుడు అభివృద్ధికే కాక రియల్ ఎస్టేట్ కూడలిగా మారడం విశేషం.

నగర విస్తరణతో..

గతంతో పోలిస్తే ప్రస్తుతం ఖమ్మం నగరం విస్తరించింది. నూతన బస్టాండ్, కార్పొరేషన్, నూతన కలెక్టరేట్ నిర్మాణాలతో అభివృద్ధి వికేంద్రీకరణ జరగగా.. నూతన బస్టాండ్ సమీపంలోని ఎన్నెస్పీ క్యాంపులో బహుళ అంతస్తుల షాపింగ్ కాంప్లెక్స్‌లు, అపార్ట్‌మెంట్లు వెలిశాయి. దీంతో ఇక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకుంది. ఇక్కడ ఒక్కచోటే కాకుండా నలువైపులా నగరం విస్తరించింది. ఈ క్రమంలో భూములు హాట్‌కేకుల్లా అమ్ముడవుతున్నాయి. నూతన కలెక్టరేట్ నిర్మాణంతో గోపాలపురం నుంచి వి.వెంకటాయపాలెం వరకు భూముల ధరలు గతంతో పోలిస్తే చాలామేర పెరిగాయి. కరోనాతో రియల్ ఎస్టేట్ వ్యాపారం కొంత మందగించినా.. ఈ నిర్మాణాలతో మళ్లీ పూర్వవైభవం తెచ్చుకుంది.

ఇరవై ఎకరాల విస్తీర్ణంలో కలెక్టరేట్..

రఘునాథపాలెం మండలంలోని వి.వెంకటాయపాలెం వద్ద 20 ఎకరాల విస్తీర్ణంలో నూతన కలెక్టరేట్ నిర్మించారు. ఇక్కడ సేకరించిన భూమి ఎకరానికి రూ.కోటి చొప్పున రైతులకు నష్టపరిహారం అందజేశారు. ప్రస్తుతం కలెక్టరేట్ ప్రారంభం కావడంతో వి.వెంకటాయపాలెం సెంటర్‌గా మారింది. నూతన కలెక్టరేట్‌తో ఈ ప్రాంత రూపురేఖలు మారిపోగా.. పలువురు ఉపాధి కేంద్రంగా వ్యాపారాలు ఏర్పాటుచేసుకున్నారు. ఇదేసమయాన వైరా రోడ్డును విస్తరించి డివైడర్ల నిర్మాణంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి.

రూ.3 కోట్ల నుంచి రూ.20 కోట్లకు..

కలెక్టరేట్ నిర్మాణానికి పూర్వం వి.వెంకటాయపాలెంలో భూముల ధరలు సాధారణ స్థాయిలోనే ఉండేవి. కానీ ఇప్పుడు ఒక్కసారిగా ఐదు రెట్లు పెరిగాయి. కలెక్టరేట్ నిర్మాణానికి ముందు మెయిన్‌రోడ్డు సమీపాన ఎకరం ధర రూ.2.50 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు ఉండగా.. కొంచెం లోపలకు వెళ్తే రూ.60 లక్షల నుంచి రూ.80 లక్షలు ఉండేది. కానీ ఇప్పుడు మెయిన్ రోడ్డు పక్కన ఎకరం ధర రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్లకు చేరగా, లోనకు వెళ్లినా రూ.3.50 కోట్లు నుంచి రూ.4 కోట్లకు చేరడం విశేషం.

అన్ని రకాలుగా అభివృద్ధి ..



నాకు మెయిన్ రోడ్డులో ఉన్న ఎకరంన్నర భూమి కలెక్టరేట్‌కు ఇస్తే ఎకరానికి రూ.కోటి చొప్పున పరిహారం చెల్లించారు. వ్యక్తిగతంగా నాకు నష్టం జరిగినా.. కలెక్టరేట్ రావడంతో ఈ ప్రాంతం అభివృద్ధి జరిగింది. కలెక్టరేట్ నిర్మాణంతో ఈ ప్రాంతం ఇప్పుడు పట్టణం మాదిరి రూపుదిద్దుకుంది.

– కుతుంబాక నరేష్, రైతు, వి.వెంకటాయపాలెం, ఖమ్మం

గ్రామ రూపురేఖలు మారాయి ..



కలెక్టరేట్ మా గ్రామానికి వస్తుందనుకోలేదు. ఇప్పుడు కలెక్టరేట్‌కు తోడు డబుల్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుతో వ్యాపార పరంగా అభివృద్ధి సాధ్యమైంది. గ్రామంలో ఉపాధి అవకాశాలు పెరిగాయి. చిరు వ్యాపారులకు పూర్తిస్థాయిలో ఉపాధి లభిస్తుండడం శుభపరిణామం.

– బానోతు రమేష్, వి.వెంకటాయపాలెం, ఖమ్మం

కేంద్రానికి ముందే రండి.. ప్రశాంతంగా రాయండి

- రేపటి నుంచి ఇంటర్‌మీడియట్ వార్షిక పరీక్షలు
- పక్కాగా నిమిషం నిబంధన, సందేహాల నివృత్తికి కంట్రోల్ రూం
- జిల్లాలో హాజరుకానున్న 35,857మంది విద్యార్థులు
- 'సాక్షి'తో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి రవిబాబు

సాక్షి ఇంటర్వ్యూ



ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి(డీఐఈఓ) కె.రవిబాబు వెల్లడించారు. నిర్ణీత తేదీల్లో ఉదయం 9నుంచి 12గంటల వరకు జరగనుండగా.. విద్యార్థులను 8గంటల నుంచే అనుమతిస్తామని తెలిపారు. విద్యార్థులు ముందుగానే కేంద్రాలను సరిచూసుకుని నిర్ణీత సమయానికి హాజరుకావాలని సూచించారు. నిమిషం నిబంధన పక్కాగా అమలుచేయనున్నందున ఆలస్యంగా వచ్చి పరీక్ష కోల్పోవద్దని ఆయన తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం మొదలుకానున్న నేపథ్యాన చేస్తున్న ఏర్పాట్లు, విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సోమవారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు

పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్ల విషయంలో అపోహలకు గురికావొద్దు. టీఎస్‌బీఐఈ వైబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుని కళాశాల ప్రిన్సిపాల్ సంతకం లేకుండా పరీక్షకు రావొచ్చు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా పరీక్షకు హాజరుకావాలి. ఉదయం 8గంటల నుంచే పరీక్ష కేంద్రాలకు అనుమతించనుండగా, 8–30గంటల్లోగా కేంద్రాలకు రావాలని ఇప్పటికే సూచించాం.. గతేడాది ఒకరిద్దరు విద్యార్థులు ఆలస్యంగా రావడంతో పరీక్ష కోల్పోయారు. అందుకే హడావుడి పడకుండా ముందుగానే కేంద్రాలు వచ్చి ప్రశాంతంగా పరీక్ష రాయాలి. ఏమైనా ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూంను 99489 04023, 7793 916207 నంబర్ల ద్వారా సంప్రదించవచ్చు.

63 కేంద్రాలు

జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షల కోసం 63 కేంద్రాలు ఏర్పాటుచేశాం. ప్రభుత్వ కళాశాలల్లో 17, ప్రైవేట్‌లో 28, ప్రభుత్వ అనుబంధ కళాశాలల్లో తొమ్మిది, ప్రభుత్వ పాఠశాలల్లో ఆరు, ప్రైవేట్ పాఠశాలలు రెండుతో పాటు ఇంజనీరింగ్ కళాశాలలో ఒక కేంద్రం ఉంది. పరీక్షలకు 35,857మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 17,890 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 17,967 మంది ఉన్నారు.

అన్ని సౌకర్యాలు

ఉన్నతాధికారులు, కలెక్టర్ గౌతమ్ ఆదేశాలతో కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నాం. డ్యూయల్ డెస్క్‌లు ఏర్పాటు చేయగా, నిరంతరం విద్యుత్ సరఫరా, తాగునీరు, బస్సు సౌకర్యం కల్పిస్తాం. అలాగే, నిఘా కోసం సీసీ కెమెరాలు ఏర్పాటుచేయించాం. ఇక ఎవరైనా అస్వస్థతకు గురైతే వెంటనే చికిత్స చేసేలా వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది అందుబాటులో ఉంటారు.

రెండు కమిటీలతో పర్యవేక్షణ

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా జరిగేలా హైపవర్ కమిటీ(హెచ్‌సీపీ), జిల్లా ఎగ్జామినేషన్ కమిటీ(డీఈసీ)లు పర్యవేక్షిస్తాయి. హైపర్ పవర్ కమిటీ చైర్మన్‌గా కలెక్టర్ గౌతమ్ వ్యవహరించనుండగా సీపీ విష్ణు ఎస్.వారియర్, వరంగల్ ఆర్‌జేడీ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి, ఒక సీనియర్ ప్రిన్సిపాల్, సీనియర్ లెక్చరర్ సభ్యులుగా ఉంటారు. ఇక డీఈసీ కమిటీ చైర్మన్‌గా నేను, సభ్యులుగా ఇద్దరు ప్రిన్సిపాళ్లు, ఒక లెక్చరర్ వ్యవహరిస్తారు. అలాగే, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, పది మందితో సిట్టింగ్ స్క్వాడ్లు ఏర్పాటుచేశాం.

ఉత్తీర్ణత శాతం పెరుగుతుంది..

ఇంటర్మీడియట్ ఫలితాల పెంపునకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. తక్కువ మార్కులు వస్తున్న విద్యార్థులు సుమారు 1,500మంది వరకు గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాం. అదే విధంగా విద్యార్థులకు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాం. గతేడాది 68శాతం వరకు ఉత్తీర్ణత శాతం నమోదైంది. ఇది ఈ ఏడాది మరింత పెరుగుతుందని ఆశిస్తున్నాం.

లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు : వీసీలో మంత్రి సబిత



వీసీలో పాల్గొన్న కలెక్టర్ గౌతమ్, పక్కన సీపీ వారియర్, అధికారులు

ఇంటర్ పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ నుండి సోమవారం ఇంటర్ బోర్డు అధికారులతో కలిసి ఇంటర్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా అధికారులకు వీసీ ద్వారా సూచనలు చేశారు. ఆందోళనకు గురయ్యే విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన టెలీ మానస్–14416, హాల్‌టికెట్లు నేరుగా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశంతో పాటు సూచనలు ఇచ్చేందుకు ఏర్పాటుచేసిన 040–24601010, 24655027 టోల్‌ఫ్రీ నంబర్లపై అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో ఏర్పాట్లను కలెక్టర్ గౌతమ్ వివరించగా, విష్ణు ఎస్.వారియర్, అదనపు కలెక్టర్ ఎస్.మధుసూదన్, డీఐఈఓ రవిబాబు, డీఎంహెచ్ఓ మాలతి, డీఈఓ సోమశేఖరశర్మ, ఆర్టీఓ కిషన్‌రావు పాల్గొన్నారు. తొలుత జిల్లా కేంద్రంలోని పలు పరీక్ష కేంద్రాలను డీఐఈఓ పరిశీలించారు.

ఇదేనా మీ పనితీరు ?!

- ఇబ్బంది ఉన్నప్పుడు కష్టపడితేనే ఫలితం
- పంటలు ఎండిపోతున్నా పట్టించుకోకపోవడం సరికాదు
- ఎన్నెస్పీ ఆయకట్టును పరిశీలించిన ఈఎన్‌సీ నాగేందర్‌రావు



పెనుబల్లిలో పొలాన్ని పరిశీలిస్తున్న ఈఎన్‌సీ నాగేందర్‌రావు, పక్కన ఎమ్మెల్యే సండ్ర తదితరులు

ఖమ్మంఅర్బన్/కూసుమంచి/పెనుబల్లి/తల్లాడ: సాగర్ జలాల సరఫరాలో ఇబ్బందులతో జిల్లాలోని చివరి ఆయకట్టు భూముల్లో పంటలు ఎండిపోతున్నాయి. దీంతో కొన్నాళ్లుగా రైతులు ఆందోళనలు చేస్తుండడంతో నీటి పారుదల శాఖ ఈఎన్‌సీ నాగేందర్‌రావు జిల్లాలో పర్యటించారు. తొలుత ఆయన పాలేరు రిజర్వాయర్, నాయకన్‌గూడెం వద్ద ఉన్న ఇన్‌ఫాల్ రెగ్యులేటరీని పరిశీలించి అధికారులతో చర్చించారు. రిజర్వాయర్‌లో నీటి మట్టం పడిపోతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని అధికారులను ఆరా తీశారు. ఆతర్వాత జిల్లా కేంద్రంలోని సీఈ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం పెనుబల్లి, తల్లాడ మండలాల్లో సాగర్ కాల్వలు, పంటలను సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో కలిసి పరిశీలించిన ఈఎన్‌సీ సాయంత్రం కల్లూరులోని ఎస్ఈ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈసమావేశం రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగగా, నీటి సరఫరాలో లోపాలను సరిదిద్దేందుకు అధికారులు సమయానుకూలంగా స్పందించడం లేదని ఈఎన్‌సీ మందలించినట్లు తెలిసింది. అలాగే, సమీక్ష ఉందని తెలిసినా గైర్హాజరైన ఉద్యోగిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇబ్బంది ఉన్నప్పుడే కష్టపడి పనిచేయాలని.. రైతులను నొప్పించకుండా ఉన్న వనరులతోనే సాధ్యమైనంత మేర ఆయకట్టుకు నీరందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఇబ్బందులపై ప్రత్యేక దృష్టి సారిస్తాం..

పెనుబల్లిలో సాగర్ కాల్వకు ఏర్పాటుచేసిన రాతోని ఎత్తిపోతల పథకం ద్వారా నీరు సరిగ్గా సరఫరా కాక ఎండిపోయిన పొలాలను ఎమ్మెల్యే సండ్ర, ఈఎన్‌సీ నాగేందర్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఎన్‌సీ.. స్థానిక అధికారులతో చర్చించి నీటి సరఫరాపై పలు సూచనలు చేశారు. కాగా, అధికారుల సమన్వయలోపంతో సమస్య ఎదురవుతోందని ఎమ్మెల్యే ఫిర్యాదు చేయడంతో ఈఎన్‌సీ మాట్లాడుతూ 300 క్యూసెక్కుల నీటిని 15 రోజుల పాటు సరఫరా చేయడమే కాక ఇతర ఇబ్బందులపై దృష్టి సారిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గంగదేవిపాడులో స్థానిక అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. అలాగే, తల్లాడ మండలం బిల్లుపాడులో సీఈ శంకర్‌నాయక్, ఎస్ఈ ఆనంద్‌కుమార్, డీఎస్‌సీ అప్పల నాయుడుతో కలిసి పరిశీలించగా పంటలు ఎండిపోయే వరకు ఏం చేస్తున్నారంటూ ఈఎన్‌సీ స్థానిక అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. ఇక కూసుమంచి మండలం నాయకన్‌గూడెం వద్ద కూడా ఇన్‌ఫాల్ రెగ్యులేటరీని పరిశీలించిన సమయంలోనూ అధికారులను ఈఎన్‌సీ మందలించారు. కాగా, ఖమ్మంలో ఈఎన్‌సీ నాగేందర్‌రావును రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు తదితరులు కలిసి జిల్లాలో సాగునీటి సమస్యపై విన్నవించి పరిష్కరించాలని కోరారు. ఈ పర్యటనలో సీఈ శంకర్‌నాయక్, ఎస్ఈ నర్సింగరావు, ఈఈలు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరావు, డీఈ రామారావు, మధు, ఏఈలు కిరణ్‌తో పాటు నాయకులు కనగాల వెంకట్రావు, బొర్రా వెంకటేశ్వర్లు, తావునాయక్, దుగ్గిదేవర వెంకట్‌లాల్, దూపాటి భద్రరాజు, రుద్రాక్ష బ్రహ్మం, ఇంజం కృష్ణార్జున్, దగ్గుల శ్రీనివాసరెడ్డి, సుదర్శన్, రఘు, చెరకు మల్లి కుటుంబరావు, వేమూరి ప్రసాద్, పారా ప్రసాద్, చుంచు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి మూలమూర్తులు ముత్తంగి అలంకరణలో దర్శనమిచ్చి భక్తులను మురిపించా రు. ప్రతీ సోమవారం స్వామివారిని ఈ రూపంలో అలంకరించడం ప్రత్యేకత. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

స్వార్థం కోసమే కల్లబొల్లి మాటలు

- సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ కొట్టడం ఖాయం
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- జీఓ 58, 59 కింద ఇళ్ల పట్టాల పంపిణీ



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి పువ్వాడ, పక్కన కలెక్టర్ గౌతమ్, మేయర్ నీరజ తదితరులు


ఖమ్మంమయూరిసెంటర్: ఎన్నికలు సమీపిస్తుండడంతో ఖమ్మంలో కొందరు నాయకులు కనీసం అజెండా లేకుండా కేవలం స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసమే కల్లబొల్లి మాటలు చెబుతున్నారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ విమర్శించారు. ఖమ్మంలో జీఓ నెంబర్ 58, 59 ద్వారా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు సోమవారం ఆయన ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సీఎం కేసీఆర్ నేతృత్వాన విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని తెలిపారు. కల్లబొల్లి మాటలతో కాలం గడిపితే 24గంటల విద్యుత్, రైతు బంధు, రైతు బీమా, పెన్షన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు వచ్చేవా అని ప్రశ్నించారు. కేసీఆర్‌ని గద్దె దింపుతామని చెబుతున్న వారు తమ స్థాయి తెలుసుకోవాలని హితవు పలికారు. తెలంగాణలో పేదలు ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్న సదరు నాయకుడు... టేకులపల్లిలో బహిరంగ చర్చకు రావాలని సూచించారు. కాగా, గోదావరి నీళ్లతో రైతుల కాళ్లు కడిగే సమయం సమీపిస్తోందని.. ఆ ఉధృతిలో ఇప్పుడు విమర్శలు చేస్తున్న వారు కొట్టుకుపోవడం ఖాయమన్నారు. కాగా, ప్రజలందరికీ పూర్తి స్థాయిలో న్యాయం చేసేదాక ఖమ్మంను వీడేది లేదని, ఎవరికి, ఎప్పుడు, ఎలా బుద్ధి చెప్పాలో ప్రజలకు బాగా తెలుసునని మంత్రి చెప్పారు.

ఖమ్మంలోనే తొలిసారి..

పేదలకు మేలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నెంబర్ 58, 59 ద్వారా ఇళ్ల పట్టాలను రాష్ట్రంలోనే తొలిసారి ఖమ్మంలో పంపిణీ చేస్తున్నామని మంత్రి పువ్వాడ తెలిపారు. ఈమేరకు 18వ డివిజన్ రామకృష్ణ నగర్‌లో, 53వ డివిజన్‌లోని ఫ్రీడమ్ పార్క్‌లో 16, 18, 19, 21, 22, 23, 53 డివిజన్ల పేదలకు ఆయన పట్టాలు అందజేశారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో మంత్రుల వినతితో దరఖాస్తుకు మరింత గడువు ఇస్తూ సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఖమ్మం నగరంలోనే 2వేల డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించగా, ఇంకా రాని వారికి సొంత స్థలం ఉంటే రూ.3 లక్షలు ప్రభుత్వం తరపున ఇస్తామని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వీ.పీ.గౌతమ్, మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, మందడపు లక్ష్మి, పల్లా రోజ్‌లీనా, ఆళ్ల నిరీషారెడ్డి, మక్బూల్, మేడారపు వెంకటేశ్వర్లు, చామకూరి వెంకన్న, పగడాల శ్రీవిద్య, తహసీల్దార్ శైలజ, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, గుండాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను విమర్శించే స్థాయి లేదు

పొంగులేటిపై ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యే సండ్ర ధ్వజం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధుసూదన్, పక్కన ఎమ్మెల్యే సండ్ర తదితరులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ను విమర్శించే స్థాయి మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డికి లేదని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్, సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్, కేసీఆర్‌ను విమర్శించే ముందు ఆయన ఏ పార్టీలో ఉన్నారు, ఏ పార్టీలో చేరుతున్నారో చెప్పాలని సూచించారు. తెలంగాణ తీసుకొచ్చింది కాంగ్రెస్, బీజేపీ అని పొంగులేటి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేర్చడం కోసం కేసీఆర్ 2001 ఏడాదిలో టీఆర్ఎస్‌ను స్థాపించి, అనుక్షణం ప్రజల ఆకాంక్షల కోసమే పనిచేశారనే విషయాన్ని ఎవరిని అడిగినా చెబుతారన్నారు. కాగా, పొంగులేటి ఏడేళ్ల పాటు పార్టీలో ఉన్నప్పుడు గుర్తుకు రాని అంశాలు ఇప్పుడే ఎందుకు గుర్తుకొస్తున్నాయో చెప్పాలని సూచించారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌తో అత్యధిక సమయం గడిపిన నేత పొంగులేటి ఒక్కరేనని.. అయినా ఇప్పుడు పార్టీ అజెండా నచ్చలేదా, పదవులు రాక విమర్శిస్తున్నారో చెప్పాలని పేర్కొన్నారు. ఏదిఏమైనా బీఆర్ఎస్‌ను, ముఖ్యమంత్రి కేసీఆర్‌ను విమర్శిస్తే బీఆర్ఎస్ శ్రేణులు తగిన బుద్ధి చెబుతాయని మధు, సండ్ర పేర్కొన్నారు. కాగా, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పుట్టిన రోజు సందర్భంగా వారు పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ఈ సమావేశంలో జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరి ఉమామహేశ్వరరావు, నాయకులు చింతనిప్పు కృష్ణచైతన్య, ఖమర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

15న ఎంపీ నామ జన్మదిన వేడుకలు

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్ఎస్ లోక్‌సభ పక్షనేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను ఈనెల 15న ఘనంగా నిర్వహించనున్నట్లు ఎంపీ క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ కనకమేడల సత్యనారాయణ, రైతు బంధు సమితి జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటలకు పార్టీ జిల్లా కార్యాలయంలో రక్తదానం శిబిరం ఏర్పాటుచేయగా, ఖమ్మంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, సర్దార్ పటేల్ స్టేడియాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమాల్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు, ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, లావుడ్యా రాములునాయక్, కందాల ఉపేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ లింగాల కమలరాజు పాల్గొంటారని, పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని వారు కోరారు.

పూర్వ విద్యార్థి నేతృత్వాన కళావేదిక


కళావేదికను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ రవీంద్రరెడ్డి, తదితరులు

తల్లాడ: తల్లాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.1.20 లక్షలతో నిర్మించిన కళావేదికను సోమవారం ఎంపీడీఓ రవీంద్రరెడ్డి ప్రారంభించారు. పాఠశాల పూర్వ విద్యార్థి, హైదరాబాద్‌లో సీఐగా విధులు నిర్వర్తిస్తున్న నాసగోని నరేష్ తన తల్లిదండ్రులు మల్లయ్య – కమలాబాయి జ్ఞాపకార్థం ఈ కళావేదికను నిర్మించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పుట్టిన ఊరు, చదువుకున్న పాఠశాలను మరిచిపోకుండా అందరూ సహకరిస్తే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఎంఈఓ ఎస్.దామోదరప్రసాద్‌తో పాటు దగ్గుల రఘుపతిరెడ్డి, దుగ్గిదేవర వెంకట్‌లాల్, కోటిరెడ్డి, ఎండీ.నవాబ్‌పాషా, తోట ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలు

ఖమ్మంలీగల్: తీసుకున్న అప్పు చెల్లించే క్రమంలో చెల్లని చెక్కు ఇవ్వడంతో నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ సోమవారం తీర్పు వెలువడింది. ఖమ్మం రెండో అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి పి.మౌనిక సోమవారం వెల్లడించిన ఈ తీర్పు వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురానికి చెందిన ఇంటూరి సుధ వద్ద ఇల్లెందుకు చెందిన రిటైర్డ్ ఉద్యోగి వెంకటేశ్వర్లు 2018, సెప్టెంబర్ 23న రూ.లక్ష అప్పుగా తీసుకున్నాడు. ఆ తర్వాత 2019 జనవరి 28న ఆయన ఇచ్చిన చెక్కును బ్యాంకులో జమ చేయగా నగదు లేకపోవడంతో బౌన్స్ అయింది. దీంతో సుధ తన న్యాయవాది ద్వారా కోర్టులో దాఖలు చేసిన ప్రైవేట్ కేసును న్యాయమూర్తి విచారించి వెంకటేశ్వర్లుకు ఆరు నెలల జైలు శిక్ష విధించడంతో పాటు రూ.లక్ష చెల్లించాలని తీర్పు చెప్పారు.

తాళంవేసి ఉన్న ఇంట్లో చోరీ

సత్తుపల్లిటౌన్: తాళంవేసి ఉన్న ఓ ఇంట్లో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. సత్తుపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు గాదె సత్యనారాయణ ఇంటికి తాళంవేసి రెండు నెలలుగా హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఆదివారం అర్ధరాత్రి దొంగలు తాళం పగులగొట్టి దేవుడి గదిలోని వెండి వస్తువులు, బీరువాలోని బంగారు ఆభరణాలు చోరీచేశారు. సోమవారం ఉదయం ఆయన బంధువు ఇంటి వద్దకు రాగా తాళం పగులగొట్టి ఉండడంతో రూ.10వేల విలువైన వస్తువులు చోరీ అయినట్లుగా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వీధి కుక్కల దాడిలో గాయాలు

మధిర/నేలకొండపల్లి: మధిర మున్సిపాలిటీ పరిధి జిలుగుమాడులో ఐదేళ్ల బాలుడు దోర్నాల వివేక్‌పై సోమవారం వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. ఇంటి ముందు వివేక్ ఆడుకుంటుండగా, గుంపుగా వచ్చిన కుక్కలు దాడి చేశాయి. బాలుడి అరుపులతో గమనించిన ఆయన తండ్రి కుక్కలను తరిమేశాడు. అలాగే, నేలకొండపల్లికి చెందిన ప్రేమ్‌కుమార్, నరేష్ సోమవారం ఉదయం ప్రధాన సెంటర్‌కు వస్తుండగా కుక్కలు దాడి చేయగా గాయపడ్డారు. దీంతో వీరికి స్థానిక ఆస్పత్రిలో చికిత్స చేయించారు.

కోతుల దాడిలో ఒకరికి...

కారేపల్లి: కారేపల్లి బీసీ కాలనీకి చెందిన కుమ్మరి వేణుపై సోమవారం రాత్రి కోతులు మూకుమ్మడిగా దాడి చేయడంతో గాయపడ్డాడు. దీంతో ఆయనకు స్థానిక పీహెచ్‌సీలో చికిత్స చేయించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,560	7,000
కందులు	7,980	5,700
అలసంద	6,000	6,000
మిర్చి	21,600	20,000
మిర్చి తాలు	13,700	7,500
పత్తి	7,300	5,500

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,781

కనెక్షన్ లేకున్నా నల్లా పన్ను

- నగరంలో వందలాది మందికి నోటీసులు
- రూ.వేలల్లో బకాయి ఉన్నట్లు వెల్లడి
- ఆందోళనతో కేఎంసీ కార్యాలయానికి క్యూ


పన్ను నోటీసుల్లో తప్పులు దొర్లాయని వినతిపత్రాలు ఇస్తున్న నగరవాసులు, (ఇన్‌సెట్) ఇంటికి నల్లా లేకున్నా పన్ను చెల్లించాలని జారీ అయిన నోటీసు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం ప్రశాంతినగర్‌లో నివాసముండే ఓ కుటుంబానికి నల్లా కనెక్షన్ లేకున్నా రూ.6,360 బకాయి ఉందంటూ నోటీసు జారీ చేశారు. ఈ బకాయితో పాటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పన్ను కూడా చెల్లించాలని చెప్పడంతో ఆ కుటుంబ యజమాని సోమవారం కేఎంసీ ప్రజావాణిలో అధికారులను కలిశారు. దీంతో అధికారులు లేఖ రాయించుకుని సమస్య పరిష్కరిస్తామంటూ ప్పి పంపించారు. ప్రజావాణిలో ఇలాంటి ఫిర్యాదులే పదుల సంఖ్యలో రావడం గమనార్హం. బకాయి వసూళ్లలో భాగంగా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు జారీ చేస్తున్న నోటీసులు నగర వాసులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఇటీవల జారీ చేసిన ఆస్తి, పంపు పన్నుల నోటీసుల్లో అనేక తప్పులు దొర్లడంతో యజమానులు కేఎంసీ కార్యాలయానికి బారులుతీరుతున్నారు.

పంపు కనెక్షన్ లేకుండానే..

నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో పంపు కనెక్షన్లు లేని ఇళ్లకు కూడా ఉన్నట్లుగానే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఐదేళ్ల క్రితం నగర పాలక సంస్థలోని అసెస్‌మెంట్లు, పంపు కనెక్షన్ల వివరాలను ఆన్‌లైన్ చేసే సమయాన ఈ తప్పులు దొర్లాయి. కొందరు నల్లా కోసం దరఖాస్తు చేసుకుంటే కనెక్షన్ ఇవ్వకపోగా.. ఆన్‌లైన్‌లో మాత్రం నమోదు చేశారు. దీంతో అప్పటి నుంచి వేస్తున్న పన్ను ఇప్పుడు పేరుకుపోయి నోటీసులు జారీ చేయడానికి కారణమవుతోంది.

చెల్లించినా బకాయే..

కేఎంసీలో ఆన్‌లైన్ విధానం అమలుకాక ముందు ఇంటి యజమానుల నుండి బిల్లు బుక్కుల ద్వారా బిల్ కలెక్టర్లు పన్ను వసూలు చేసే వారు. అయితే, ఆన్‌లైన్ చేసే సమయాన వీటిని నమోదు చేయకపోవడంతో ఇంకా బకాయి ఉన్నట్లు చూపిస్తోంది. అలాగే, మరికొందరు బిల్ కలెక్టర్లు వసూలు చేసిన నగదును కేఎంసీకి చెల్లించకపోవడం కూడా ఓ కారణంగా తెలుస్తోంది. బాధితులు పన్ను చెల్లించిన రశీదులతో అధికారులను కలుస్తున్నారు. దీంతో వారి నుండి లేఖలు, రశీదులు తీసుకుంటున్న అధికారులు సమస్య పరిష్కరిస్తామని చెప్పి పంపిస్తున్నారు.

> **ఆన్‌లైన్ విధానంలో తప్పులు..**
>
> కేఎంసీ రికార్డులను ఆన్‌లైన్ చేసినా సమయాన దొర్లిన తప్పులను పరిష్కరిస్తున్నాం. పంపు కనెక్షన్ లేకున్నా పన్ను చెల్లించాలని జారీ అయిన నోటీసులను పరిశీలిస్తున్నాం. వీటిని ఆన్‌లైన్ నుంచి తొలగిస్తాం. కొందరు నల్లా కోసం దరఖాస్తు చేసుకుని కనెక్షన్ తీసుకోకున్నా పన్ను నోటీసులు జారీ అయినట్లు గుర్తించాం. – జి.శ్రీనివాసరావు, ఆర్‌ఐ, కేఎంసీ

లక్ష్మీ శ్రీనివాస జ్యూయెలరీ ప్రారంభం

సందర్శించిన మంత్రి పువ్వాడ,
ప్రారంభించిన నటి, యాంకర్ రష్మీ


లక్ష్మీ శ్రీనివాస జ్యూయెలరీని ప్రారంభిస్తున్న రష్మీ, పక్కన యాజమాన్యం


షోరూంలో పరిశీలిస్తున్న మంత్రి పువ్వాడ

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంలోని ఇల్లెందు క్రాస్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన లక్ష్మీ శ్రీనివాస జ్యూయెలరీస్ నూతన బ్రాంచ్‌ను సినీ నటి, యాంకర్ రష్మీ సోమవారం ప్రారంభించారు. తొలుత షోరూంను రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సందర్శించి నిర్వాహకులను అభినందించారు. కాగా, షోరూంను ప్రారంభించిన రష్మీ అక్కడకు వచ్చిన వారిని పలకరించడంతో పాటు షోరూంలోని వివిధ విభాగాల్లో ఆభరణాలను పరిశీలించారు. పాతికేళ్లుగా ఉమ్మడి జిల్లా ప్రజలకు నాణ్యమైన సేవలందిస్తున్న షోరూం యాజమాన్యాన్ని అభినందించారు. అనంతరం షోరూం నిర్వాహకులు దుగ్గి శ్రీనివాసరావు, దుగ్గి లక్ష్మి, దుగ్గి అభినయ్ మాట్లాడుతూ లైట్‌వెయిట్ జ్యూయెలరీ తమ ప్రత్యేకత అని, హోల్‌సేల్ ధరల్లో వెండిని విక్రయిస్తుండగా ఈనెల 20వ తేదీ వరకు ఎన్ని గ్రాముల బంగారం కొనుగోలు చేస్తే దానికి రెట్టింపు వెండి ఉచితంగా ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ, సుడా చైర్మన్లు కూరాకుల నాగభూషణం, బచ్చు విజయ్‌కుమార్, భద్రాద్రి అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పశుపక్షాదులను రక్షించుకుందాం..

పశుపక్షాదుల రక్షణను సమాజంలో అందరూ బాధ్యతగా భావించాలని సినీ నటి, యాంకర్, జంతు ప్రేమికురాలు రష్మీ గౌతమ్ అన్నారు. ఖమ్మం వచ్చిన ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కుక్కల దాడిలో ఓ చిన్నారి మృతి చెందడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ కారణంతో జంతువులను చంపితే సమస్య పరిష్కారం కాదని పేర్కొన్నారు. జంతువుల్లో సంతతి పెరుగుదల ఆగకపోవడం, అడవులు అంతరించిపోతుండటంతో అవి మనుగడను కోల్పోతున్నాయని తెలిపారు. ఈమేరకు జంతువుల ఆరోగ్య రక్షణకు అవసరమైన వ్యాక్సిన్లు ఇప్పించాలని, విదేశీ జాతుల కుక్కలకు బదులు స్థానిక కుక్కలను ఆసక్తి ఉన్న వారు పెంచుకోవాలని కోరారు. అలాగే, వేసవిలో పక్షులు, పశువులు దాహార్తితో ఇబ్బంది పడకుండా నీటి సౌకర్యం కల్పించేందుకు కృషి చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

బీఆర్ఎస్ కార్యాలయంలో...

‘ఆస్కార్’ సంబరాలు


బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన సంబరాల్లో ఎమ్మెల్సీ మధు, ఎమ్మెల్యే సండ్ర తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలకు ఆస్కార్ అవార్డ్ లభించడంపై బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో సోమవారం సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, బీఆర్ఎస్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చింతనిప్పు కృష్ణచైతన్య, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు, ఖమర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఆర్‌ఆర్‌ఆర్‌కు ఆస్కార్ అవార్డు రావడంపై సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి, గీత రచయిత చంద్రబోస్, దర్శకుడు రాజమౌళి, కథానాయకులు జూనియర్ ఎన్టీఆర్, రాంచరణ్, గాయకులు రాహుల్ సిప్లీగంజ్, కాలభైరవ, నృత్య దర్శకులు ప్రేమ్ రక్షిత్ తదితరులకు రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వేర్వేరు ప్రకటనల్లో అభినందనలు తెలిపారు.

అమ్మకు వందనం !

మధిర: మధిరలోని శ్రీనిధి పాఠశాలలో సోమవారం ‘అమ్మకు వందనం’ పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ తల్లులకు పాదాభివందనం చేసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కరస్పాండెంట్ అంజన్‌బాబు మాట్లాడుతూ విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, డైరక్టర్ చందు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.


తల్లులకు పాదాభివందనం చేస్తున్న విద్యార్థులు

కాంగ్రెస్ పాలన కోసం ప్రజల ఎదురుచూపులు


కాంగ్రెస్ పథకాల కరపత్రాలు అందజేస్తున్న మాజీ మంత్రి చంద్రశేఖర్

సత్తుపల్లిరూరల్: బీఆర్ఎస్ పాలనలో ఏ ఒక్క నిరుపేదకు ఇళ్లు దక్కకపోగా.. అన్ని ధరలు పెంచి పేద, మధ్యతరగతి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుండడంతో ప్రజలు కాంగ్రెస్ పాలన కోసం ఎదురు చూస్తున్నారని ఏఐసీసీ సభ్యుడు, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా సోమవారం సత్తుపల్లి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన ఆయన ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ కరెంట్ బిల్లుల మోత మోగుతుండగా, గ్యాస్ సిలిండర్ ధర పెంచారని, పంటలకు గిట్టుబాటు ధర దక్కడంలేదని తెలిపారు. ఈమేరకు దేశం, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్ తీరుపై విసిగిపోయిన ప్రజలు వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు బైరెడ్డి మనోహర్‌రెడ్డి, సత్తుపల్లి మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శివవేణు, కొత్రపాటి సాల్మన్‌రాజుతో పాటు గోళ్ల అప్పారావు, హలావత్ వెంకటేశ్వర్లు, తోట రాజేష్, గుంటూరు శివశంకర్‌రావు, దుబ్బాక చందు, రేపాక నర్సింహం, చెన్నారావు, కుమారి తదితరులు పాల్గొన్నారు.

హరితహారం మొక్కలు దగ్ధం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని ఊట్లపల్లి పంచాయతీలో అశ్వారావుపేట–భద్రాచలం ప్రధాన రహదారి వెంట హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు సోమవారం మంటల్లో కాలిపోయాయి. గుర్తుతెలియని వ్యక్తులు ప్రధాన రహదారి వెంట చెత్తకు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించి రహదారి పక్కనే ఉన్న అడవితోపాటు, హరితహారం మొక్కలు దగ్ధమయ్యాయి.

పెద్దాస్పత్రిని సందర్శించిన ఎన్ఎంసీ బృందం


పెద్దాస్పత్రిలో అధికారులు, వైద్యులతో చర్చిస్తున్న ఎన్ఎంసీ బృందం

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం జనరల్ ఆస్పత్రిని నేషనల్ మెడికల్ కౌన్సిల్(ఎంఎంసీ) ప్రతినిధి బృందం సోమవారం పరిశీలించింది. ఈసందర్భంగా మాండ్య మెడికల్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.కే.మహదేవ్, కర్నూలు కళాశాల ప్రొఫెసర్ జి.మహేష్, కడప కళాశాల ప్రొఫెసర్ ఏ.సురేఖ నేతృత్వంలోని బృందం సభ్యులు ఆస్పత్రిలో పరిశీలించి మెడికల్ కళాశాల ఏర్పాటుకు అవసరమైన సౌకర్యాలపై ఆరా తీశారు. అన్ని విభాగాలను పరిశీలించిన వారు వైద్యులు, సిబ్బంది వివరాలు తెలుసుకున్నాక అధికారులు, వైద్యులతో సమావేశమై సర్టిఫికెట్లు పరిశీలించారు. అనంతరం పాత కలెక్టరేట్‌లోని మెడికల్ కళాశాల ఏర్పాటుకు జరుగుతున్న పనులపై ఆరా తీశారు. గత జనవరిలో తొలి దఫా పరిశీలన చేయగా, రెండో పరిశీలన కూడా పూర్తయిన నేపథ్యాన ఎన్ఎంసీ బృందం ఇచ్చే నివేదిక ఆధారంగా త్వరలోనే మెడికల్ కళాశాలకు పూర్తిస్థాయి అనుమతులు వస్తాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజేశ్వరరావు, మెడికల్ సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు, ఆర్ఎంఓలు బి.శ్రీనివాసరావు, అమర్‌సింగ్, డాక్టర్ కృపాఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

చీపురు పట్టిన విద్యార్థులు..


పాఠశాల ఆవరణలో శుభ్రం చేస్తున్న విద్యార్థులు

మధిర: మధిరలోని సీపీఎస్ విద్యార్థులు సోమవారం ఎప్పటిమాదిరిగానే పాఠశాలకు వచ్చారు. అయితే, వారు నేరుగా తరగతి గదులకు వెళ్లకుండా తొలుత చీపుర్లు పట్టుకుని పాఠశాల ఆవరణను శుభ్రం చేశారు. కాగా, పిల్లలను ఊడుస్తున్న ఫొటోలు, వీడియోలు వైరల్ కావడంతో తల్లిదండ్రులు ఉపాధ్యాయుల తీరును తప్పుపట్టారు. ఈ విషయమై హెచ్ఎం డాక్టర్ ప్రభుదయాళ్ను వివరణ కోరగా నెలకు రూ. 4వేలు తన సొంత డబ్బుతో స్వీపర్‌ను ఏర్పాటుచేసినా, అనారోగ్య కారణాలతో రాలేదని చెప్పారు. దీంతో పిల్లలు స్వచ్ఛందంగా పాఠశాలను శుభ్రం చేశారే తప్ప తానెవరికీ పని చెప్పలేదని వెల్లడించారు.

16 కిలోల గంజాయి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ పరితోష్ పంకజ్

భద్రాచలంటౌన్: ఒడిశా నుంచి అక్రమంగా తరలిస్తున్న నిషేధిత గంజాయిని సోమవారం పోలీసులు పట్టుకున్నారు. భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ కథనం ప్రకారం... పట్టణ ఎస్సై మధు ప్రసాద్ సిబ్బందితో కలిసి ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీలు చేస్తున్న క్రమంలో ముగ్గురు యువకులు అనుమానాస్పదంగా కనిపించారు. వారి బ్యాగులను తనిఖీ చేయగా 16 కిలోల గంజాయి లభించింది. విచారించగా తమిళనాడు రాష్ట్రం చెన్నైకి చెందిన జీవనందన్, మనికందన్, శంకర్‌గా తేలింది. పోలీసులు విచారిస్తున్న సమయంలో శంకర్ తప్పించుకుని పరారయ్యాడు. మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించామని, పట్టుబడ్డ గంజాయి విలువ రూ.3.20 లక్షలు ఉంటుందని ఏఎస్పీ తెలిపారు. సమావేశంలో పట్టణ సీఐ నాగరాజు రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స కోసం రూ.1.06లక్షల ఆర్థికసాయం


శ్రీకాంత్ తల్లికి నగదుకు అందచేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన ముళ్లపాటి శ్రీకాంత్ మెదడులో రక్తం గడ్డకట్టగా కొన్నాళ్ల నుంచి ఖమ్మంలోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయనకు చికిత్స చేయించుకునే స్థోమత లేకపోవడంతో సత్తుపల్లి యువభారత్‌శక్తి ఫౌండేషన్ బాధ్యులు సోషల్ మీడియా ద్వారా రూ.1.06 లక్షలు సేకరించి కుటుంబ సభ్యులకు సోమవారం అందించారు. ఫౌండేషన్ నిర్వాహకులు కామెర్ల క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిపై లైంగిక వేధింపులు

చింతకాని: మండలంలోని లచ్చగూడెంలో తొమ్మిదో విద్యార్థినిని లైంగిక వేధిస్తున్న వ్యక్తిపై సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన విద్యార్థిని స్థానికుడే అయిన బి.నాగరాజు కొంతకాలంగా లైంగికంగా వేధిస్తుండంతో పాటు ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. ఈ సమాచారం అందుకున్న ఐసీడీఎస్ అధికారులు బాలికతో మాట్లాడి చేసిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

నిండా నీరు.. దారి లేక ఇక్కట్లు

తిరుమలాయపాలెం: చెరువు నిండి అలుగు పోస్తుండడంతో పంట పొలాలకు వెళ్లే దారి మూసుకుపోయి ఇబ్బంది పడుతున్నామని మండలంలోని బచ్చోడు గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని రెడ్డికుంట చెరువు సమీపాన 70 మంది రైతులకు 300 ఎకరాలకు పైగా భూములు ఉన్నాయి. ప్రస్తుతం భక్తరామదాసు ప్రాజెక్టు నీటితో చెరువు అలుగు పోస్తుండడంతో పొలాలకు వెళ్లేందుకు వారు ఇబ్బంది పడుతున్నారు. ఈమేరకు పొలాలకు వెళ్లేలా బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రజాప్రతినిధులు కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

మేనకోడలు ఫంక్షన్‌కు వచ్చి ఆత్మహత్య

ఖమ్మంక్రైం: మేనకోడలు ఓణీల ఫంక్షన్‌లో ఉత్సాహంగా పాల్గొన్న వ్యక్తి ఆతర్వాత ఖమ్మంలో రైలు క్రిందపడి ఆత్మహత్య చేసుకుంది. జీఆర్పీ ఎస్సై భాస్కర్‌రావు కథనం ప్రకారం వివరాలు... ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంకు చెందిన సెక్యూరిటీ గార్డు పిన్నిశెట్టి విజయ్ (32) ఖమ్మం ప్రకాష్‌నగర్‌లో మేనకోడలు ఓణీల ఫంక్షన్‌కు వచ్చాడు. ఆతర్వాత ఇంటి నుంచి వెళ్లిన ఆయన సోమవారం ఖమ్మం–పందిళ్లపల్లి స్టేషన్ల నడుమ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా, ఆయన వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకున్నట్లు వెల్లడించిన పోలీసులు.. మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు సహకారంతో మార్చురీకి తరలించారు.

తల్లిదండ్రులు మందలించారని...

సత్తుపల్లిరూరల్: తల్లిదండ్రులు మందలించారనే కారణంతో ఓ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. సత్తుపల్లి మండలం బేతుపల్లికి చెందిన సత్తెనపల్లి దివ్య(15) గంగారం హైస్కూల్ తొమ్మిదో తరగతి చదువుతుంది. ఆమె పాఠశాలకు సక్రమంగా వెళ్లకపోవడంతో ఈనెల 8న తల్లిదండ్రులు మందలించగా అదేరోజు రాత్రి పురుగుమందు తాగింది. దీంతో ఆమెకు సత్తుపల్లి ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేయించి హైదరాబాద్ తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె సోమవారం మృతిచెందగా స్వగ్రామానికి తీసుకొచ్చారు. కాగా, దివ్య మృతదేహం వద్ద ఎమ్మెల్యే వెంకటవీరయ్య, ఎంపీపీ దొడ్డా హైమావతితో పాటు శంకర్‌రావు, యాగంటి శ్రీనివాసరావు, బెల్లంకొండ రాములు నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు.

దైవదర్శనానికి వెళ్తూ రైలులో గుండెపోటుతో మృతి


రైలులో మృతి చెందిన సావిత్రి

ఖమ్మంక్రైం: నేపాల్‌లో దైవ దర్శనానికి వెళ్తున్న ఓ వృద్ధురాలు రైలులో గుండెపోటుతో మృతి చెందింది. ఖమ్మం జీఆర్పీ ఎస్సై భాస్కర్‌రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా నంది వెలుగుకు చెందిన పలువురు నేపాల్‌లో వైష్ణోదేవి దర్శనానికి గోరక్‌పూర్ రైలులో బయలుదేరారు. అయితే, జనరల్ బోగీలో రద్దీ ఉండడంతో రైలు విజయవాడ దాటాక ఆ బృందంలోని కనుగోలు సావిత్రి(62)కి గుండెపోటు వచ్చి తీవ్ర అస్వస్థతకు గురైంది. కాగా, రైలు అప్పటికే బయలుదేరగా, మధ్యలో ఎక్కడా ఆగకుండా ఖమ్మం చేరుకుంది. దీంతో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది ఆమెను కిందకు దించి 108లో జిల్లా ఆస్పత్రికి తరలించగా ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

చందాదారుల సొమ్ముతో దందా!

▶ మొదటి పేజీ తరువాయి

చెల్లిస్తున్న సొమ్ముకు ఎలాంటి భద్రతా లేదు' అని పేర్కొన్నారు. సోమవారం వెలగపూడిలోని సచివాలయంలో వారు సంయుక్తంగా విలేకరులతో మాట్లాడుతూ మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలను వివరించారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐడీ అదనపు డీజీ సంజయ్. చిత్రంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ రామకృష్ణ

■ చిట్‌ఫండ్ చట్టం సామాజిక, ఆర్థికపరమైన చట్టమని సుప్రీంకోర్టు గతంలోనే స్పష్టం చేసింది. చందాదారుల హక్కుల పరిరక్షణ, చిట్‌ఫండ్ కంపెనీల్లో ఆర్థిక క్రమశిక్షణ కోసమే ఈ చట్టం చేశారని పేర్కొంది. చిట్‌ఫండ్స్ చట్టం–1982 ప్రకారం చిట్‌ఫండ్ కంపెనీ బ్రాంచిలోని మేనేజర్ (ఫోర్‌మేన్) చందాదారులు చెల్లించే సొమ్ముకు పరిరక్షకుడు. చిట్స్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పర్యవేక్షకుడు. ■ బ్యాంక్ లావాదేవీల నిర్వహణ, నిధుల చెల్లింపులన్నీ ఫోర్‌మేన్ నిర్వహించాలి. రాష్ట్రంలో మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు ఉన్న 37 బ్రాంచీల్లో ఏడు బ్రాంచిలో తనిఖీలు చేశాం. చందాదారులు చెల్లించిన మొత్తం అక్కడి బ్యాంకుల్లో లేదన్న విషయం అందులో వెల్లడైంది. ఆ సొమ్మంతా నిబంధనలకు విరుద్ధంగా పక్క రాష్ట్రానికి తరలించేశారు. ■ మార్గదర్శి ఫోర్‌మేన్‌కు చట్ట ప్రకారం ఉండాల్సిన చెక్ పవర్‌తోసహా ఎలాంటి అధికారాలు లేవు. బ్యాంకు వ్యవహారాలు, చెక్ పవర్ అంతా హైదరాబాద్‌లోని మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎండీ శైలజతోపాటు ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలోని 11 మందికే ఉంది. ■ ఇక్కడున్న చందాదారుల సొమ్ముల భద్రత గురించి అడిగితే తనకు తెలియదని ఫోర్‌మెన్ చెబుతున్నారు. హైదరాబాద్ వెళ్లి అడిగితే తెలంగాణలో ఉన్న ప్రధాన కార్యాలయం ఏపీ అధికారుల పరిధిలోది కాదంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన చందాదారులు చెల్లిస్తున్న డబ్బులకు బాధ్యులెవరని ప్రశ్నిస్తే సమాధానమే లేదు. సొమ్ము రాష్ట్ర ప్రజలది...పెత్తనం పక్క రాష్ట్రంలో వారిది. ■ మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారులకు చెందిన సొమ్ములను నిబంధనలకు విరుద్ధంగా మ్యూచువల్ ఫండ్స్, ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్, తమ అనుబంధ కంపెనీల్లో పెట్టుబడులుగా పెట్టారు. ఆ సంస్థ బ్యాలన్స్ షీట్, కొన్ని బ్యాంకు ఖాతాలను చార్టెడ్ అకౌంటెంట్ ద్వారా పరిశీలిస్తే ఈ విషయాలు బయటపడ్డాయి. అందుబాటులో ఉన్న కొన్ని బ్యాంకు ఖాతాలను పరిశీలించగా ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్స్‌లో మూడుసార్లు రూ.29 కోట్లు, రూ.10 కోట్లు, రూ.8 కోట్లు చొప్పున, ఎడెల్‌వైజ్ ఆర్బిట్రేజ్ ఫండ్స్‌లో రూ.10 కోట్లు చొప్పున నిబంధనలకు విరుద్ధంగా పెట్టుబడులు పెట్టినట్లు వెల్లడైంది. పూర్తి బ్యాంకు ఖాతాలను పరిశీలిస్తే ఇంకా ఎన్ని పెట్టుబడులు పెట్టారో తెలుస్తుంది. ■ విశాఖపట్నం, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరులో మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఫోర్‌మెన్‌లను అరెస్టు చేసి న్యాయస్థానంలో ప్రవేశపెట్టాం. గుంటూరు మినహా మిగతా మూడు చోట్లా న్యాయస్థానాలు నిందితులకు రిమాండ్ విధించాయి. నిందితులపై సీఐడీ మోపిన అభియోగాలకు సంబంధించి ప్రాథమిక ఆధారాలున్నాయని రిమాండ్‌కు అనుమతిస్తూ న్యాయస్థానాలు స్పష్టం చేశాయి. సీఐడీ కేసు డైరీలో పేర్కొన్న అంశాలతో తాము సంతృప్తి చెందినట్లు, వారిని అరెస్టు చేయడం సరైనదేనని పేర్కొన్నాయి.■ మార్గదర్శి యాజమాన్యం నిధుల ను అక్రమంగా బదిలీ చేస్తూ, చిట్స్ రిజిస్ట్రార్‌కు సహాయ నిరాకరణ కొనసాగిస్తే చందాదారుల ప్రయోజనాల పరిరక్షణ కోసం చర్యలు తీసుకుంటాం. ఇతర రాష్ట్రాల్లో ఏం చేస్తున్నారన్న అంశంతో మాకు నిమిత్తం లేదు. ఏపీ ప్రయోజనాలు, చందాదారుల సొమ్ముకు భద్రత కల్పించడమే మా విధి. ఈ కేసులో విచారణ కొనసాగిస్తాం. కేసు దర్యాప్తులో పురోగతికి అనుగుణంగా ఏ–1 చెరుకూరి రామోజీ రావు, ఏ–2 చెరుకూరి శైలజనూ విచారించడంతోపాటు ఇతర చర్యలను తగిన సమయంలో తీసుకుంటాం.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఇదో.. పోంజీ తరహా స్కామ్

మార్గదర్శి చిట్‌ఫండ్స్‌యాజమాన్యం పోంజీ స్కామ్ తరహా అక్రమాలకు పాల్పడుతోంది. చిట్టీలలో 30 శాతం నుంచి 40 శాతం టికెట్లు (సభ్యత్వాలు) యజమాన్యం పేరిట ఉంచుతోంది. ఆ టికెట్లకు చెల్లించాల్సిన చందాలను చెల్లించడం లేదు. ఇతర చందాదారులు చెల్లించిన చందాలను తాము చెల్లించినట్లు రికార్డుల్లో చూపిస్తోంది. వాటిపై మళ్లీ 5 శాతం కమీషన్ తీసుకుంటోంది. చందాదారుల సొమ్మును వ్యక్తిగత ప్రయోజనాలకు వాడుకుంటోంది.

ఇక్కడెందుకీ పిటిషన్?

మార్గదర్శిని ప్రశ్నించిన తెలంగాణ హైకోర్టు

- ఏపీలో హైకోర్టు ఉంది కదా..?
- కేసులు, దర్యాప్తు అంతా అక్కడే..
- అలాంటప్పుడు వీటిని విచారించే పరిధి ఈ కోర్టుకు ఉందా?
- దీనిపై తేలకుండా దర్యాప్తులో జోక్యం చేసుకోలేం
- విచారణ ఈ నెల 20వతేదీకి వాయిదా
- నిందితులు ఏ రాష్ట్రంలో ఉన్నా అరెస్టు అధికారం పోలీసులకు ఉంది
- వారిపై నమోదైనవి 10 ఏళ్ల పైగా శిక్ష పడే కేసులే
- ఏపీలో నమోదైన కేసుల్లో ఇక్కడ ఉపశమనం కోరలేరు
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ న్యాయవాది వాదనలు

సాక్షి, హైదరాబాద్: 'ఆంధ్రప్రదేశ్‌లో హైకోర్టు ఉంది కదా..? మరి ఇక్కడెందుకీ పిటిషన్ దాఖలు చేశారు..?' అని మార్గదర్శి చిట్‌ఫండ్స్ యాజమాన్యాన్ని తెలంగాణ హైకోర్టు ప్రశ్నించింది. కేసులు ఏపీలో నమోదయ్యాయి.. విచారణ అధికారులూ ఏపీ వారే.. బ్రాంచ్‌లు ఉన్నది కూడా అక్కడే.. అలాంటప్పుడు ఈ పిటిషన్‌పై విచారణ జరిపే పరిధి ఈ కోర్టుకు ఉందా? అని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. దీనిపై తేలకుండా దర్యాప్తులో తాము జోక్యం చేసుకోవడం సరికాదని అభిప్రాయపడింది. ఏదేమైనా విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేస్తున్నామని, అలోగా పరిధిపై నిర్ణయిస్తామని స్పష్టం చేసింది. మార్గదర్శిపై ఏపీలో నమోదైన కేసుల దర్యాప్తులో భాగంగా అరెస్టు సహా బలవంతపు చర్యలు చేపట్టకుండా, హైదరాబాద్‌లోని తమ ప్రధాన కార్యాలయంలో తనిఖీలు నిర్వహించకుండా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్, చెరుకూరి రామోజీరావు, శైలజ తరఫున లంచ్‌మోషన్ పిటిషన్లు దాఖలయ్యాయి. దీనిపై తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న అనంతరం తదుపరి విచారణను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ గోవిందరెడ్డి, మార్గదర్శి తరఫున న్యాయవాది దుర్గాప్రసాద్ వాదనలు వినిపించారు.

అక్కడి కేసులపై.. ఇక్కడ విచారణా?

'409, 477(ఏ), 420 సహా పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. ఇవన్నీ 10 ఏళ్లకు పైగా శిక్ష పడే కేసులే. కాగ్నిజబుల్ నేరాల కిందికే వస్తాయి. ఏపీలో నమోదైన కేసులపై ఇక్కడ ఉపశమనం కోరలేరు. ఈ కోర్టుకు అక్కడి కేసులపై విచారణ జరిపే పరిధి లేదు. గతంలో పిటిషన్‌పై విచారణ సందర్భంగా తెలంగాణలోని మార్గదర్శి కార్యాలయాల్లో తనిఖీలపై కోర్టు స్టే ఇచ్చింది. అయితే అప్పటికే స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్లను, రిజిస్టర్లను పరిశీలించగా అనేక అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఈ క్రమంలో కేసులు నమోదు చేశారు. అక్రమాలు నిగ్గు తేలినప్పటికీ కేసులు నమోదు చేయవద్దని, ఎఫ్ఐఆర్ దాఖలు చేయవద్దని కోర్టు ఉత్తర్వుల్లో ఆదేశించలేదు. చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌పై తీవ్ర ఆరోపణలున్నాయి. మొత్తం బ్రాంచ్‌లకు వారే బాధ్యులు. ఖాతాదారుల నుంచి వసూలు చేసిన నగదును మ్యూచ్‌వల్ ఫండ్స్, షేర్ మార్కెట్లలోకి అక్రమంగా మళ్లిస్తున్నారు. చట్టాలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ చందాదారుల హక్కులకు విఘాతం కలిగిస్తున్నారు. ఒకటి రెండు అంశాల్లో మినహా ఏపీ హైకోర్టు పరిధిలోని విషయాలపై తెలంగాణ హైకోర్టు కలుగజేసుకునే అవకాశం లేదు. ఇది ఏపీ పునర్విభజన చట్టంలో స్పష్టంగా ఉంది. ప్రత్యేకంగా ఏపీకి హైకోర్టు ఏర్పాటైన తర్వాత తెలంగాణ హైకోర్టుకు అక్కడి అంశాలపై పరిధి ఉండదని చట్టం చెబుతోంది. ఒక్క డెట్ రిలీఫ్ ట్రిబ్యునల్(డీఆర్‌టీ)కి సంబంధించి డీఆర్‌టీ–2 రాయలసీమ పరిధి వరకు జోక్యం చేసుకోవచ్చని చట్టం చెబుతోంది. కేసులు నమోదు చేసిన నేరాలన్నీ ఏపీలోనే జరిగాయి. దర్యాప్తు చేస్తున్న పోలీసులూ అక్కడి వారే. అలాంటప్పుడు అరెస్టులు చేయవద్దని ఇక్కడ కోరడం చట్ట విరుద్ధం. అసలు అలా పిటిషనే వేయలేరు. హైకోర్టుల పరిధికి సంబంధించి సుప్రీంకోర్టు కూడా పలు సందర్భాల్లో స్పష్టంగా పేర్కొంది. ఏపీ హైకోర్టు పరిధిలో కలుగజేసుకోలేమని ఇదే హైకోర్టు పలు తీర్పులను ఇచ్చింది. నిందితులు ఏ రాష్ట్రంలో ఉన్నా అరెస్టు చేసే అధికారం పోలీసులకు ఉంటుంది. అది వారికున్న చట్టబద్ధమైన అధికారం. ఏపీలో హత్య చేసి వచ్చి తెలంగాణలో దాక్కుని అరెస్టు చేయవద్దని ఇక్కడి కోర్టును కోరడం ఎలా చట్టవిరుద్ధమో.. ఇదీ అంతే' అని గోవిందరెడ్డి నివేదించారు. ''పోలీసులు హైదరాబాద్ వస్తున్నారా?'' అని న్యాయమూర్తి ప్రశ్నించగా.. ప్రాథమికంగా నేరం జరిగింది.. అక్రమాలు జరిగాయని నిరూపణ అయితే అరెస్టు చేయవచ్చని గోవిందరెడ్డి నివేదించారు. ఇదో భారీ వైట్ కాలర్ నేరమన్నారు.

ముందుగా 'పరిధి' తేలుద్దాం..

'ఖాతాదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదు. అయినా తనిఖీలు చేస్తున్నారు. ఎఫ్ఐఆర్‌లో ఏ–1గా రామోజీరావు, ఏ–2గా శైలజ పేర్లు చేర్చారు. మార్గదర్శి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ తెలంగాణలో నివసించడం, తెలంగాణలోని బ్రాంచ్‌ల్లోనూ తనిఖీలు చేసే అవకాశం ఉన్నందున ఈ హైకోర్టులో పిటిషన్ వేశాం. ఏపీలో పలు బ్రాంచ్ మేనేజర్లను అరెస్టు చేసి కేసులు నమోదు చేశారు. తనిఖీలపై స్టే విధిస్తూ ఇదే కోర్టు గతంలో మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఇప్పుడు తనిఖీలు చేపడితే అది కోర్టు ఆదేశాలను ఉల్లంఘించడమే అవుతుంది' అని మార్గదర్శి తరఫు న్యాయవాది దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. ఈ సమయంలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ మిగతా అంశాల జోలికి ఇప్పుడు వెళ్లకుండా అసలు ఈ కోర్టుకు పరిధి ఉందా? లేదా? అన్న విషయాన్ని ముందుగా తేలుద్దామని స్పష్టం చేశారు.

+ తెలంగాణ ప్రభుత్వం తరఫున న్యాయవాది రూపేందర్ వాదనలు వినిపించారు. తెలంగాణ డీజీపీని ప్రతివాదిగా చేర్చారని, అసలు ఈ పిటిషన్ విచారణార్హం కాదన్నారు. వచ్చే సోమవారం వరకు పిటిషనర్లపై అరెస్టులు లాంటి చర్యలు తీసుకోబోమని గోవిందరెడ్డి తెలియచేయడంతో న్యాయమూర్తి విచారణను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేశారు.

అవినాశ్‌పై ఎలాంటి చర్యలొద్దు

అరెస్టు సహా ఎలాంటి బలవంతపు చర్యలు చేపట్టొద్దు

- సీబీఐకి తెలంగాణ హైకోర్టు ఆదేశం.. మధ్యంతర ఉత్తర్వులు జారీ
- సునీత పిటిషన్ వెనుక సీబీఐ హస్తం ఉంది
- ఏడాది తర్వాత ఆమె మాట మార్చారు..
- ఆ అభియోగాల వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయి
- వివేకా అల్లుడు, షమీమ్ పాత్రపై సీబీఐ విచారణ చేయడం లేదు
- అన్ని అంశాలపై దర్యాప్తు సాగేలా ఆదేశించండి
- హైకోర్టులో అవినాశ్‌రెడ్డి తరఫు న్యాయవాది వాదనలు

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు విన్న అనంతరం అరెస్టు సహా ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని సీబీఐని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. తాము తీర్పు వెలువరించే వరకు ఈ మధ్యంతర ఆదేశాలు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. వివేకా హత్య కేసులో సీబీఐ తనను విచారణకు హాజరు కావాలని ఆదేశించడంపై స్టే విధించాలని కోరుతూ అవినాశ్‌రెడ్డి తెలంగాణ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఒకవేళ విచారణ చేపట్టినా ఆడియో, వీడియో రికార్డింగ్‌తోపాటు దర్యాప్తు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగేలా సీబీఐని ఆదేశించాలని అభ్యర్థించారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం మరోసారి విచారణ చేపట్టారు. ఎంపీ అవినాశ్‌రెడ్డి(పిటిషనర్) తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పు రిజర్వు చేశారు. తదుపరి విచారణపై స్టే ఇవ్వాలన్న పిటిషన్‌పైనా తీర్పు రిజర్వు చేస్తున్నట్లు న్యాయస్థానం పేర్కొంది.



రాజకీయ ఒత్తిళ్లతోనే అభియోగాలు..

'సునీత పిటిషన్ వెనుక సీబీఐ హస్తం ఉంది. కొందరు రాజకీయ నేతల ఒత్తిళ్లతోనే ఆమె పిటిషనర్ (అవినాశ్‌రెడ్డి)పై అభియోగాలు మోపారు. తన తండ్రి పిటిషనర్ గెలుపు కోసం తీవ్రంగా శ్రమించారని, ఇంటింటికి తిరిగారని హత్య జరిగిన అనంతరం కూడా చెప్పిన సునీత ఏడాది తర్వాత మాట మార్చారు. ఆ తర్వాత నుంచి పిటిషనర్‌పై ఆరోపణలు చేయడం ప్రారంభించారు. వివేకా హత్య కేసులో అల్లుడు రాజశేఖర్‌రెడ్డి, హతుడి రెండో భార్య షమీమ్ పాత్రపై సీబీఐ విచారణ సాగించడం లేదు. వివేకా 2010లో రెండో పెళ్లి చేసుకున్నారు. వారికి ఓ కుమారుడు జన్మించాడు. రెండో పెళ్లి కారణంగానే వివేకా కుటుంబంలో విభేదాలు వచ్చాయి. ఆర్థిక లావాదేవీల విషయంలో మనస్పర్థలు తలెత్తాయి. ఈ క్రమంలో తన పేరుతో ఉన్న ఆస్తులను రెండో భార్య పేరుతో రాయాలని వివేకా భావించారు. ఆస్తుల గొడవల వల్లే వివేకా హత్య జరిగింది. ఈ కేసులో రెండో పెళ్లి కూడా కీలక అంశం. సీబీఐ ఆ దిశగా విచారణ చేయాలి. వివేకాది గుండెపోటని పిటిషనర్ ఎక్కడా చెప్పలేదు. స్థానిక రాజకీయ నాయకురాలు శశికళతో పిటిషనర్ అసలు మాట్లాడనే లేదు. ఆమె కూడా ఇదే విషయాన్ని సీబీఐకి చెప్పింది. ఇదే కోర్టులో సీబీఐ దాఖలు చేసిన కౌంటర్ మీడియాలో విస్తృతంగా ప్రచారమైంది. అందులో శశికళ గురించి కూడా ప్రస్తావించారు. ఇప్పటివరకు సీబీఐ రెండు చార్జిషీట్లు దాఖలు చేసినా ఎక్కడా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దర్యాప్తు నివేదికను కనీసం పరిగణలోకైనా తీసుకోలేదు. నిష్పాక్షిక దర్యాప్తు చేసేలా సీబీఐని ఆదేశించాలి. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో 14న సీబీఐ విచారణకు పిటిషనర్ హాజరుకాకుండా ఆదేశాలు ఇవ్వాలి' అని న్యాయస్థానానికి నిరంజన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

సీల్డ్ కవర్‌లో వివరాలు...

వివేకా హత్య కేసు డైరీని సీబీఐ సీల్డ్ కవర్‌లో హైకోర్టుకు సమర్పించింది. 35 మంది సాక్షుల వాంగ్మూలం, 10 డాక్యుమెంట్లు, కొన్ని ఫొటోలు, హార్డ్‌డిస్క్‌లను న్యాయస్థానం ముందు ఉంచింది. వివేకా హత్య జరిగిన ప్రాంతంలో దొరికిన లేఖ, ఎఫ్ఎస్ఎల్ నివేదికను సైతం కోర్టుకు సమర్పించింది. కేసుకు సంబంధించి ఆధారాలను ధ్వంసం చేసినట్లు పిటిషనర్‌పై ఆరోపణలున్నాయని, ఆయనపై తీవ్ర చర్యలు తీసుకోకుండా ఆదేశాలు జారీ చేయవద్దని న్యాయస్థానాన్ని సీబీఐ కోరింది. సీబీఐ కార్యాలయం ఎదుట మీడియాకు వివరాలను ఎంపీ వెల్లడించడం సరికాదని న్యాయస్థానం పేర్కొంది. ఈనెల 14న (మంగళవారం) విచారణ హాజరు నుంచి మినహాయింపు కోరే అంశంపై సీబీఐనే ఆశ్రయించాలని సూచించింది. ఈ కేసు విచారణ హైదరాబాద్‌కు బదిలీ అయిన తర్వాత పిటిషనర్ తండ్రి భాస్కర్‌రెడ్డిని కడపలో హాజరు కావాలని ఎందుకు పిలిచారని న్యాయమూర్తి సీబీఐని ప్రశ్నించారు. అయితే తాము పిలవలేదని సీబీఐ కోర్టుకు తెలిపింది. ఇదిలా ఉండగా తన మీద, తన కుటుంబంపైనా ఆరోపణలు చేశారని అందుకే ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశానని ఈ సందర్భంగా వైఎస్ సునీత కోర్టుకు నివేదించారు.

జిల్లా వార్తలు

ఆలయాల్లో అహోబిల జీయర్ స్వామి పూజలు


అన్నపురెడ్డిపల్లి : భక్తులకు ఉపదేశం చేస్తున్న అహోబిల జీయర్ స్వామి

భద్రాచలం/జూలూరుపాడు/అన్నపురెడ్డిపల్లి: భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని త్రిదండి అహోబిల జీయర్‌స్వామి సోమవారం దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు సంప్రదాయరీతిలో స్వాగతం పలకగా, అంతరాలయంలో మూలమూర్తులు, ఆలయ ప్రాంగణంలోని ఉపాలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. ఇటీవల దాతలు సమర్పించిన స్వర్ణ వాహనాల వివరాలను వేదపండితులు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు వివరించారు. అలాగే, జూలూరుపాడు మండలం కాకర్ల పాలగుట్టపై నిర్మించిన ఆలయంలో విగ్రహాల పునఃప్రతిష్టా మహోత్సవానికి కూడా హోబిల జీయర్ స్వామి హాజరై పూజలు చేశారు. సౌమిత్రి శ్రీధరాచార్యులు తదితరులు పాల్గొన్నారు. ఇంకా అన్నపురెడ్డిపల్లిలోని శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని కూడా సందర్శించిన జీయర్ స్వామి భక్తులకు ఉపదేశం చేశారు. ఆలయ మేనేజర్ రమణ, అర్చకులు గిరిధరాచార్యులు, ప్రసాదాచార్యులు పాల్గొన్నారు.

విద్యారంగంలో సమూల మార్పులు

- కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య
- రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంఅర్బన్/ఖమ్మం సహకారనగర్: విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొచ్చేందుకు రాష్ట్రంలో పెద్ద ఎత్తున గురుకుల పాఠశాలలు ప్రారంభించి కార్పొరేట్ స్థాయి విద్యను పేదలకు అందుబాటులోకి తీసుకొచ్చామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజ య్‌కుమార్ వెల్లడించారు. ఖమ్మం 10వ డివిజన్ ఇందిరానగర్ పాఠశాలతో పాటు సంభానినగర్ పాఠశాలల్లో మన బస్తీ – మన బడి కార్యక్రమంలో భాగంగా రూ.69లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను మంత్రి సోమవారం కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా మన బస్తీ – మన బడి, మన ఊరు – మన బడి ద్వారా పనులు చేపడుతున్నట్లు తెలిపారు. మొదటి విడతగా ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే పనులు చివరి దశలో ఉన్నాయని చెప్పారు. మిగిలిన పనులు వేసవి సెలవుల్లో పూర్తిచేస్తామని వెల్లడించా రు. పాఠశాలల్లో డ్యూయల్ డెస్క్‌లు, గ్రీన్ బోర్డులు తదితర సౌకర్యాలు అందుబాటులోకి రాగా విద్యార్థులతో మాట్లాడిన మంత్రి వసతులపై ఆరా తీశారు.

ఎవరూ దృష్టి లోపంతో బాధపడొద్దని..

రాష్ట్రంలో ఏ ఒక్కరు కూడా దృష్టి లోపంతో బాధపడొద్దనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ కంటివెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. ఖమ్మం 14వ డివిజన్ గొల్లగూడెం ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన కంటివెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కంటి వెలుగు వైద్య శిబిరాలకు మంచి స్పందన వస్తోందని, ప్రజలందరూ శిబిరాలకు వచ్చి పరీక్ష చేయించుకోవాలని తెలిపారు. ఈసందర్భంగా పలువురికి మంత్రి కంటి అద్దాలు అందజేశారు. ఈకార్యక్రమాల్లో మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీ, సుడా చైర్మన్లు కూరాకుల నాగభూషణం, విజయ్‌కుమార్, డీఈఓ సోమశేఖరశర్మ, డీఎంహెచ్ఓ డాక్టర్ మాలతి, కార్పొరేటర్లు చావా మాధురి నారాయణరావు, కూరాకుల వలరాజు, కర్నాటి కృష్ణ, దేశభక్తిని కిషోర్, ఎంఈఓ శ్రీనివాస్, నాయకులు శ్రీనివాస్, ఏనుపాదం, కొదుమూరి శ్రీనివాసరావు, జగన్నాధం, స్వర్ణ నాగేశ్వరరావు, పాషా, హెచ్ఎం ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.



కంటివెలుగు శిబిరంలో వృద్ధుడికి కంటి అద్దాలు అందజేస్తున్న మంత్రి అజయ్‌కుమార్ (ఇన్‌సెట్) విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ

బొగ్గు ఉత్పత్తితో పాటు రక్షణకు ప్రాధాన్యం

సింగరేణి డైరెక్టర్ సత్యనారాయణరావు

మణుగూరుటౌన్: సింగరేణిలో లక్ష్యం మేరకు బొగ్గు ఉత్పత్తి చేస్తూనే రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని డైరెక్టర్(ఈఅండ్ఎం) డి.సత్యనారాయణరావు ఆదేశించారు. మణుగూరు ఏరియాలో సోమవారం పర్యటించిన ఆయన తొలుత జీఎం కార్యాలయంలో ఏరియా అధికారులతో సమావేశమయ్యారు. ఆతర్వాత మణుగూరు ఏరియా పీకేఓసీ గని వ్యూ పాయింట్ నుంచి బొగ్గు ఉత్పత్తి, ఓబీ వెలికితీత, కేసీహెచ్‌పీలో బొగ్గు రవాణాను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాణ్యత ఆధారంగా వ్యాపారాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం లక్ష్యం మేరకు బొగ్గు ఉత్పత్తి చేసేలా రోజువారీ పర్యవేక్షించాలని సూచించారు. ఉత్పత్తి చేసిన బొగ్గును నిరాటంకంగా రవాణా చేసేందుకు యంత్రాల పనిగంటలను 14నుంచి 18గంటలకు పెంచాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏరియా జీఎం దుర్గం రాంచందర్, పీఓ లక్ష్మీపతిగౌడ్‌తో పాటు అధికారులు నర్సిరెడ్డి, వీరభద్రుడు, సురేష్, రవీందర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.


పీకేఓసీలో బొగ్గు ఉత్పత్తిని పరిశీలిస్తున్న డైరెక్టర్ సత్యనారాయణ రావు, అధికారులు

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం

నేలకొండపల్లి: మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడేందుకు అందరూ సిద్ధం కావాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. నేలకొండపల్లిలో సోమవారం జరిగిన అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు బజ్జూరి వెంకట్రామిరెడ్డి అధ్యక్షత వహించగా కోటేశ్వరరావు ముఖ్యఅతిథిగా మాట్లాడారు. పాలకులు భూపంపిణీ విషయంలో కమిటీలు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. ఆత్మహత్యల్లో రాష్ట్రానికి నాలుగో స్థానం దక్కిందని, ఇకనైనా పాలకులు మేల్కొనాలని సూచించారు. కాగా, దేశంలో పాసిస్టు పాలన సాగుతుండగా, హిందూ మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రశ్నించే వారిని నిర్బంధించేందుకు తీసుకొస్తున్న చట్టాలను తిప్పికొట్టాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఎన్‌డీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆవునూరి మధు, జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్‌తో పాటు ప్రకాష్, పాలేపొంగు నాగయ్య, ఖాసిం, రామస్వామి, ఐ.వెంకన్న, కోలా లక్ష్మీ, నారాయణ, వీరస్వామి, రహీం, మస్తాన్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలి

ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు

భద్రాచలం: ఐటీడీఏ పరిధిలోని గిరిజన గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా రాయాలని.. ఈవిషయంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు వారికి అవగాహన కల్పించాలని ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం ఆయన గిరిజన దర్బార్‌లో భాగంగా వివిధ ప్రాంతాల గిరిజనుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం వాటిని పరిశీలించి యూనిట్ల అధికారులకు అందచేసి అర్హతల ఆధారంగా సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్హులైన ప్రతీ గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు అందేలా అధికారులు శ్రద్ధ వహించాలని సూచించారు. ఆతర్వాత విద్యావిభాగం అధికారులతో సమావేశమైన పీఓ మాట్లాడుతూ విద్యార్థులందరూ పరీక్షలు ప్రశాంతంగా రాసి మంచి మార్కులు సాధించేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈసమావేశంలో ఏపీఓ డేవిడ్ రాజ్, డీడీ రమాదేవితో పాటు అధికారులు సురేష్‌బాబు, శ్రీనివాస్, మునీర్‌పాషా, రమణయ్య, భాస్కర్, ఆదినారాయణ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.


గిరిజన దర్బార్‌లో బాధితుల సమస్యలు వింటున్న పీఓ గౌతమ్, డీడీ రమాదేవి

స్పోర్ట్స్ పాఠశాలల్లో ప్రవేశాలకు తుది ఎంపికలు

భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో నిర్వహిస్తున్న మోడల్ స్పోర్ట్స్ స్కూల్స్ కిన్నెరసాని(బాలురు), కాచేనపల్లి(బాలికలు)ల్లో ఐదో తరగతి ఇంగ్లిష్ మీడియం విద్యార్థులకు ప్రవేశాలు కల్పించేందుకు తుది ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు పీఓ గౌతమ్ పొట్రు తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన భద్రాద్రి జిల్లా విద్యార్థులకు ఈనెల 20న, ఖమ్మం జిల్లా విద్యార్థులకు 21వ తేదీన కిన్నెరసాని మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌లో పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు కుల ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్ జిరాక్స్, రెండు ఫొటోలతో హాజరుకావాలని పీఓ సూచించారు. ఇక మోడల్ స్పోర్ట్స్ స్కూళ్లలో ఆరో తరగతిలో మూడు సీట్లు, ఏడో తరగతిలో ఒకటి, ఎనిమిదో తరగతిలో నాలుగు, తొమ్మిది తరగతిలో ఖాళీగా ఉన్న ఆరు సీట్లలో చేరేందుకు ఆసక్తి ఉన్న వారు ఎంపిక పోటీలకు హాజరుకావాలని పీఓ తెలిపారు.

శభాష్ మురళి...

50వ సారి రక్తదానం చేసిన ఉద్యోగి


రక్తదానం చేస్తున్న మురళి

భద్రాచలం: ఆపరేషన్లు మొదలు నుంచి సికిల్‌సెల్, తలసేమియా బాధితులకు అవసరమైనప్పుడు రక్తదానం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న భద్రాచలానికి చెందిన కొప్పుల మురళి సోమవారం 50వ సారి రక్తదానం చేశాడు. ములుగు జిల్లా వెంకటాపురం గ్రామానికి చెందిన కొప్పుల మురళి ఉపాధి నిమిత్తం భద్రాచలంలో ఉంటుండగా, పాల్వంచ మండలానికి చెందిన నాలుగు రోజుల చిన్నారికి అవసరం కావడంతో రక్తదానం చేసి పలువురి అభినందనలు అందుకున్నాడు. భద్రాచలంలో డిగ్రీ చదువుతున్న సమయాన మదర్ థెరిస్సా ఛారిటబుల్ ట్రస్టు స్థాపించిన మురళి.. తలసేమియా, సికిల్ సెల్ బాధితులకు తానే కాకుండా ఇతరులకు రక్తదానం చేయిస్తున్నాడు. అలాగే, నిరుపేద విద్యార్థులు చదువుకునేలా ఫీజులు, పుస్తకాలు సమకూర్చే ఆయన, ప్లాస్టిక్ రహిత భద్రాద్రి కోసం పలు కార్యక్రమాలు చేపట్టారు.


16న అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

మహబూబాబాద్ అర్బన్: మహబూబాబాద్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఈనెల 16న అథ్లెటిక్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి బి.నాగమణి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో 16 ఏళ్ల పైబడిన మహిళలకు 100 నుంచి 5వేల మీటర్ల వరకు, లాంగ్ జంప్, షాట్‌పుట్ ఈవెంట్లు నిర్వహిస్తామన్నారు. ఇక్కడ ఎంపికైన వారిని హైదరాబాద్‌లో జరిగే పోటీలకు ఎంపిక చేస్తామని, ఆసక్తి ఉన్న వారు వివరాలకు 90526 70288 నంబర్‌లో సంప్రదించాలని ఆమె సూచించారు.

విస్తృతంగా వాసవీ క్లబ్ సేవలు

వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ సెక్రటరీ రామకృష్ణ

మహబూబాబాద్ రూరల్: వాసవీ క్లబ్ ఆధ్వర్యాన విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని క్లబ్ ఇంటర్నేషనల్ సెక్రటరీ ఇరుకుల్ల రామకృష్ణ తెలిపారు. మహబూబాబాద్ వాసవీ క్లబ్ (హోం), వాసవీ వనిత క్లబ్, వాసవీ క్లబ్ అనంతాద్రి లెజెండ్స్ నూతన కార్యవర్గాల ప్రమాణ స్వీకారం సోమవారం శ్రీవాసవి దేవాలయంలో నిర్వహించారు. నూతన కార్యవర్గాలతో రామకృష్ణ, డిస్ట్రిక్ట్ గవర్నర్ రవ్వా గీత ప్రమాణస్వీకారం చేయించగా రామకృష్ణ మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యాన చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఇంకా విస్తృతం చేయనున్నట్లు తెలిపారు. వాసవీ క్లబ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్లు మాలె యోగేశ్వర్‌రావు, గార్లపాటి శ్రీనివాస్‌తో పాటు వేమిశెట్టి కిషోర్‌కుమార్, గార్లపాటి వెంకటేశ్వర్లు, వేంశెట్టి ఏకాంబరం, ఇమ్మడి కృష్ణమూర్తి, బొల్లం శ్రీనివాస్, వల్లాల రమేశ్, ప్రొద్దుటూరు గౌరీశంకర్, వజినపెల్లి అనిల్ కుమార్, మాలె శ్రవణ్, చీదర వీరన్న, సోమ రజనీ కుమార్, సోమ రాధాకృష్ణ, పుల్లఖండం ప్రభాకర్, ప్రతాపని పుష్ప, శ్రీరాం సుష్మ, వేంశెట్టి ప్రవంతి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఇరుకుల్ల రామకృష్ణ